# విపశ్యన మాసపత్రిక

VOLUME:26 NO - 17 1 AUGUST, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

**"ధర్మవాణి"**

*ఓవదెయ్యానుసాసెయ్య, అసబ్భా చ నివారయే !*
*సతమ్హి సో పియో హోతి, అసతం హోతి అప్పియో !!*
– *ధమ్మపద – 77, పణ్డిత వగ్గో*

ప్రవచనాలిచ్చి, శిక్షణనిచ్చి, అనుచిత కర్మలు చేయకుండా ఆపే వ్యక్తి, సత్పురుషులకు ప్రియుడు, అసత్పురుషులకు అప్రియుడు అవుతాడు.

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(ఇది జూలై 27, 2018 న వెలువడిన హిందీ మాసపత్రిక యొక్క అనువాదం)**

*1969వ సంవత్సరం జూలై 3వ తేదీన ముంబాయిలోని పంచాయతీ వాడీ ధర్మశాలలో, భారతదేశంలో విపశ్యన సాధన యొక్క మొదటి శిబిరం నిర్వహించబడింది. భారతదేశంలో ఈ విద్య పునఃస్థాపితమయి, 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక సంవత్సరం పాటు – అనగా 3 జూలై 2018 నుండి 2 జూలై 2019 వరకూ – స్వర్ణజయంతి ఉత్సవాలు జరుపుకోవాలనే సంకల్పం తీసుకోవడం జరిగింది. తద్వారా ఈ సంవత్సరం, తమ రోజువారీ సాధనను పుష్టి చేసుకోవటంలో సాధకులకు సహాయకారిణి కావాలి. దీనితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వస్తుంది, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, తమలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, మేలు చేకూర్చుకోగలరు. ఇదే విధంగా ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్యలోని వ్యావహారిక పక్షాన్ని అంటే సాధనను దృఢపరుచుకోవడానికే ఈ వేడుకలు జరుపుకోవాలి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత.*

*ఈ ప్రారంభ పత్రికను విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారి జీవితాన్ని గురించి సంక్షిప్తంగా వివరించటంతో మొదలుపెడుతున్నాము. ఈ సందర్భంగా, వారి పూర్వీకులు వలస పోవటం మరియు వారి వ్యాపార విషయాల గురించి శ్రీ గోయంకా గారే స్వయంగా ఇలా వ్రాసారు –*

### ధర్మదేశంలో నూట ఇరవై అయిదు సంవత్సరాలు

నూట ఇరవై అయిదు సంవత్సరాల క్రితం ఎంతో ఉత్సాహవంతుడైన ఒక నవ యువకుడు, వారి పూర్వీకుల నగరమైన చూరూ నుండి బయలుదేరి, రాజస్థాన్‌లోని ఎడారిని కొంత దూరం కాలినడకన, మరికొంత దూరం ఒంటెపైన సవారీ చేస్తూ దాటుకున్నాడు. ఆ తరువాత రైలుబండి ద్వారా కలకత్తాకు చేరుకున్నాడు. అక్కడ నుండి చిన్న పడవలో ప్రయాణించి, సముద్రాన్ని దాటి బర్మాదేశంలోని రంగూన్ నగరానికి చేరుకున్నాడు. అతడు తన జీవనోపాధిని వెదుక్కుంటూ ఇంత కష్టంతో కూడిన యాత్రను పూర్తి చేశాడు.

అలా బర్మాకు చేరుకున్న తాతగారు ఇక్కడకు రాగానే ఎలాంటి వ్యాపారాలు చేశారో నాకు పూర్తిగా తెలియదు. కానీ నా చిన్నతనంలో ఆయన నుండి విన్న మాటల ప్రకారం, ఆయన తన జీవనోపాధిని బట్టల వ్యాపారంతోనే మొదలుపెట్టారని అనుకుంటున్నాను. ఆయన రంగూన్‌లో బట్టలు కొనుగోలు చేసి, అప్పటి బర్మా రాజధాని మాండలేకు తీసుకుని వెళ్లి విక్రయిస్తూ ఉండవచ్చు. ఆ తరువాతి కాలంలో రంగూన్ మరియు మాండలేల మధ్యన జరిగే ఈ వ్యాపారానికి స్వస్తి పలికి, ఇతర వ్యాపారాలను ఎంచుకుని ఉండవచ్చు. ఆ సమయంలో ఆయన, బట్టల మూటలను గుఱ్ఱాల మీద పెట్టుకుని మాండలే నుండి షాన్ నగరానికి వెళ్ళారు. అక్కడ ఆ రోజుల్లో చిన్న చిన్న వ్యాపార సముదాయాలతో వారానికి ఒక్కసారి సంత ఏర్పాటయ్యే ఆచారం ఉండేది. ఒక్కొక్క ప్రాంతంలో వారంలో ఒక్కోరోజు సంతను నిర్వహిస్తుండేవారు. ఈ కారణంగా, తాతగారు గుఱ్ఱాల మీద తన సరుకు నింపుకుని, స్వయంగా తాను ఒక గుఱ్ఱంమీద సవారీ చేస్తూనో లేక అప్పుడప్పుడు గుఱ్ఱాలతో పాటుగా ఎత్తు–పల్లాలుండే బాటలో కాలినడకన ఒక బజారు నుండి మరొక బజారుకు వెళుతూ తన సామాగ్రిని విక్రయిస్తూ ఉండవచ్చు. అతికష్టమైన ఈ పనిలో ఆయనెన్ని కష్టాలను ఎదుర్కొన్నాడో మనం ఊహించలేము కూడా. ప్రత్యేకించి అన్న పానీయాలకు ఎంత కష్టమయ్యేదో. శుద్ధ సనాతన శాఖాహార సంస్కారాల కారణంగా ఒక నెల, ఇరవై రోజుల యాత్రకు కావలసిన భోజనాన్ని తనవెంట తీసుకుని వెళ్ళేవారు కావచ్చు. ఈ చద్ది రొట్టెలు, ఎండిపోయిన కూరలు లేదా పచ్చళ్ళతో తన క్షుద్బాధను తీర్చుకునే వారు. తాగటానికి నీరు దొరకటం కూడా కష్టమే. నీటి

కొరకు తన పొడవాటి రాజస్థానీ తలపాగాను విప్పి తాడు లాగా చేస్తూ, తన వెంట తీసుకు వెళ్ళిన చెంబుకు కట్టి ఏ బావి నుంచో నీటిని తోడుకుని తాగేవారు కావచ్చు. అలా ఎన్నో సంవత్సరాల కఠోర పరిశ్రమ తరువాత, తన ముగ్గురు పుత్రులూ పని చేయగలిగిన వయసుకు చేరుకున్నాక మాండలే నగరంలో ఒక చిన్న దుకాణం పెట్టుకుని స్థిరంగా వ్యాపారం చేయటం ప్రారంభించారు. మెల్లమెల్లగా వ్యాపారం అభివృద్ధి చెందసాగింది. చిన్న దుకాణం కాస్తా పెద్దదయింది, ఆ పెద్ద దుకాణం మరింత పెద్ద దుకాణంగా మారింది. ఆ తరువాత వ్యాపారాలన్నీ తన పుత్రులు చూసుకోవటంతో ఆయన వ్యాపారాల నుండి పూర్తిగా నిష్క్రమించారు.

## జననము మరియు బాల్యము

నేను, మాఘ శుక్ల ద్వాదశి, సంవత్ 1980 (16 ఫిబ్రవరి, 1924), శనివారం రోజున బర్మాదేశ ప్రముఖ నగరం మాండలేలో జన్మించాను.

స్వంత ఊరయిన రాజస్థాన్‌లోని చూరూలో బంగళా కట్టించటానికి మా పెద్దనాన్న శ్రీ ద్వారకాదాస్‌గారు చూరూ వెళుతుండగా, నన్ను కూడా తనతో తీసుకువచ్చారు. అక్కడ నేను మా మేనత్త దగ్గర ఉంటూ స్కూలుకు వెళ్లి చదువుకునేవాడిని. ఈ విధంగా రెండు సంవత్సరాల పాటు చూరూలోని పాఠశాలలో "కాసూ" గురువు గారి సాన్నిధ్యంలో ఉంటూ ఓనమాలు మరియు గుణింతాలకు చెందిన శిక్షణ పొందాను. ఆ రెండేళ్లలో బంగళా నిర్మాణ పనులు కూడా పూర్తి కావటంతో పెద్దనాన్నతో పాటుగా మయన్మార్‌కు తిరిగి వచ్చేశాను.

## గురువులందరి పట్లా శ్రద్ధాభావం

చూరూ పాఠశాలలో హిందీ వర్ణమాల, గుణింతాలు, అంకెలు మరియు ఎక్కాలు నేర్పించిన నా చిన్ననాటి గురువు కాసూ గారు, మెల్లకన్ను కలిగి ఉండేవారు. కొందరు విద్యార్థులు ఆయనను వెక్కిరిస్తూ దుర్భాషలాడేవారు – **"కాసూ కాణో, ఛోరానే పఢా"** – (ఓ మెల్లకన్ను కాసూ, పిల్లలకు చదువు చెప్పు).

కాసూ గురువు గారికి ఒక ఊతపదం ఉండేది – ఆయన ప్రతి మాటకూ "హోవూ" అని అనేవారు. అందుకే విద్యార్థులు – **"కాసూ బోలే హోవూ, మై కాసూ కో తావూ"** అని అనేవాళ్ళు

నా పసిమనసులో ఈ మాటలు పాతుకుపోయి, ఇంట్లో కూడా, నా నోటి నుండి అలా బయటకు దొర్లేశాయి. ఆ మాటలు విన్న మా మేనత్త, ఎంతగానో నొచ్చుకుని, నా చెవి పిండితూ, "నీకు విద్యాదానం ఇచ్చే వ్యక్తి నీకు పూజ్యులు, గౌరవపాత్రులూ అవుతారు. మరే గురువు పట్లా ఎప్పటికీ అలాంటి మాటలు మాట్లాడకూడదు" అని చెప్పారు.

మేనత్త అలా చివాట్లు పెట్టటంతో, కేవలం కాసూ గురువు గారి పట్లనే కాకుండా, ఇతర గురువులందరి పట్లా భక్తిభావం కలిగింది. ఆమె మాటలకు కట్టుబడి, అటువంటి మాటలు ఎప్పటికీ పలకకుండా జాగ్రత్తపడ్డాను.

కొద్ది కాలం తరువాత కాసూ గురువు గారు కాలం చేశారు. పిల్లలు మళ్ళీ– **"కాళీజీ కే మందిర్ ధోళీ ధ్వజా, కాసూ మరగ్యో ఖూబ్ మజా"** (కాళీ మాత మందిరంపైన ఎగిరే తెల్లటి జండా, కాసూజీ చనిపోవటం ఎంతో ఆనందంగా ఉంది) అని అనటం మొదలుపెట్టారు.

కానీ, నా నోటి నుండి అటువంటి మాటలు ఎన్నడూ బయటకు రాలేదు. ఈ విషయం తెలిసిన మా మేనత్త, ఎంతో ప్రసన్నురాలయింది. అన్నింటికన్నా గొప్ప పాఠం నా మేనత్త నాకు నేర్పించింది. పూజ్య గురుదేవుల పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి అని అన్నింటికంటే పెద్ద పాఠం బోధించిన మేనత్తదే అసలైన శిక్షణ.

బర్మాకు తిరిగి వెళ్ళగానే మొదటి తరగతి చదవటానికి అక్కడి మార్వాడీ పాఠశాలలో చేరాను. అక్కడి గురువుగారైన శ్రీ కళ్యాణదత్త దూబే గారు ఎంతో మంచివారు, పూజ్యులు. వారి సాన్నిధ్యంలో రెండు సంవత్సరాల పాటు చదువుకున్నాక, నాకు హిందీ బాష పట్ల మంచి అవగాహన వచ్చింది.

## కళ్యాణదత్త దూబే గారు

జీవనసంధ్యలో మనోఫలకంపై ఏ ఏ గురుజనుల స్మృతిరేఖలు కదులుతాయో, వారందరి పట్లా హృదయం కృతజ్ఞతా భావాలతో పులకరిస్తుంది. చూరూ పాఠశాలలో హిందీ వర్ణమాల, గుణింతాలు, అంకెలు మరియు ఎక్కాలు నేర్పించిన కాసూ గురువు గారి తరువాత, ఏయే గురుజనుల నుండి విద్యనభ్యసించానో, వారందరి ముఖాలు మళ్ళీ మళ్ళీ స్మృతిపటం పైకి ఉదయిస్తూ, తనువూ–మనసులు పులకరింతలతో రోమాంచితమవుతాయి. దాదాపు అయిదు సంవత్సరాల వయసులో, చూరూలో ప్రాథమిక శిక్షణ తీసుకుని జన్మభూమి అయిన మాండలేకు తిరిగివచ్చాక, అక్కడి 24వ వీధిలోని పాత మార్వాడీ ధర్మశాలలో ఉండే మార్వాడీ స్కూలులో చదువుకోవటం ప్రారంభించాను. దానిని స్కూలు అని కాకుండా పాఠశాల అని అనటం మరింత సమంజసంగా అనిపిస్తుంది. అందులో కేవలం మూడు తరగతులే ఉండేవి. కొందరు విద్యార్థులు, నేల మీద కూర్చుని గోడకు ఆనుకుని పలకమీద రాసుకుంటూ ప్రాథమిక శిక్షణ పొందేవారు. మిగిలిన రెండు తరగతుల విద్యార్థులూ పెద్ద పెద్ద బెంచీలపై కూర్చుని డెస్కులను ఉపయోగించేవారు. ఈ మూడింటి మధ్యలో ఎటువంటి గోడలు కానీ, మరే అడ్డంకులు/ తెరలు కాని ఉండేవి కావు. విద్యార్థులందరూ ఒకరి మాటలు ఒకరు వినగలిగేవారు, ఒకరినొకరు చూడగలిగేవారు. మూడు తరగతులకూ కలిపి ఒకే మాస్టారు ఉండేవారు. వారే కళ్యాణదత్త దూబే గారు. వారు, ఎలాంటి నిర్ధారిత సమయం లేకుండానే, ఆ మూడింటిలో ఏదో ఒక తరగతిలోని కుర్చీ మీద కూర్చుని విదార్థులకు చదువు చెప్పేవారు. ఆ పిన్నవయసులో నా మనోఫలకంపై అత్యంత ప్రభావితమైన ముద్ర వేసిన వ్యక్తి ఎవరు అంటే – అది దూబే గారే. దూబే గారు 25 – 30 సంవత్సరాలు కల అందమైన యువకుడు. తెల్లటి ధోతి, చొక్కా వేసుకుని, కళ్లకు నల్లటి కళ్ళజోడు పెట్టుకున్న మాస్టారి కరుణతో కూడిన, నవ్వుతో నిండిన పెదవులు ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. మా విద్యార్థుల పట్ల వారి హృదయంలో ఎంతో వాత్సల్య భావం ఉప్పొంగుతూ ఉండేది. బహుశా ప్రతి విద్యార్థికీ అలానే అనిపించేదో, లేక నాకే అలా అనిపించేదో కానీ నా మీద ఆయనకు విశిష్టమైన వాత్సల్యభావం ఉందని అనిపించేది.

మాస్టారు గారి ప్రతి పనీ నా బాల్య మనసు మీద తనదైన ఒక ఆదర్శవంతమైన ప్రభావాన్ని కలిగించేది. సమయం కంటే కొద్దిగా

ముందుగానే స్కూలుకు చేరుకొని చూస్తే, తెల్లటి వస్త్రాలు ధరించి, హంసవాహిని, వీణాధారిణి అయినటువంటి సరస్వతీ మాత యొక్క సుందర చిత్రం ముందు కూర్చుని, కళ్ళు మూసుకుని, చేతులు జోడించి, మధురమైన కంఠంతో – **"యా కుందేందు తుషారహార ధవళా..."** అంటూ సరస్వతీ ధ్యాన శ్లోకాన్ని పఠిస్తూ ఉండేవారు.

మధురమైన కంఠంతో పఠించిన భక్తిభావభరితమైన ఈ స్తోత్రం నన్ను భావావేశంలో ముంచెత్తింది. సారవంతమైన నా బాల్య మనసులో శారదామాత పట్ల ఉన్న భక్తికి బీజం వేసిన గీతం ముస్ముందు ప్రస్ఫుటితమై, మొలకెత్తి, పూలు, ఫలాలనిచ్చింది. ఆ తరువాతి కాలంలో జీవితపు రెండవ దశకంలో ఉన్నత పాఠశాలలో, బర్మీభాష నేర్చుకుంటూ, బర్మీ పాఠ్య పుస్తకంలో శారదా వందన పాట రాగానే ఆ గీతం కూడా నన్ను తన వైపుకు బాగా ఆకర్షించింది.

**తూయాతాట్టి** (ఓ సరస్వతీ మాత!) **తూ దేవీ** (ఓ విశిష్ట దేవి!) **సైలీ యూలీ యుబాఈ** (పది వేళ్ళనూ జోడించి నేను నీకు వందన గీతాన్ని ఆలపిస్తున్నాను).

ఈ విధంగా, త్రిపిటకాలు అంటే ఏమిటో కూడా తెలియని ఆ రోజుల్లోనే త్రిపిటకాలు ధరించిన సరస్వతీ దేవి యొక్క భక్తిభావాన్ని కలగజేసే రూపం, మనోమందిరంలో నిలిచిపోయింది.

జ్ఞాపకశక్తిని ఎంతగా పరీక్షించి చూసుకున్నా, మాండలేలోని పాఠశాలలో చేరిన తరువాత నేను చూరూలోని పాఠశాలలో నేర్చుకున్న హిందీ వర్ణమాల తరువాత ఏమేమి నేర్చుకున్నానో నాకు గుర్తుకులేవు! ఆ పాఠశాలలో ఎనిమిది సంవత్సరాల వయసు వచ్చే వరకూ దూబే గారి వద్ద చదువుకున్నాను. ఆ సమయంలో, హిందీ గద్యరూప పుస్తకాలేవీ చదివినట్లుగా నాకు గుర్తుకు లేదు. నాకు గుర్తున్నంత వరకూ, "రహిమాన్ సుధా" అనే హిందీ దోహాల (ఏక మాత్రిక ఛందస్సుతో ఉండే పద్యాలు) పుస్తకమే నేను చదువుకున్న మొదటి హిందీ పుస్తకం.

బహుశా నా హిందీ బోధన, గద్యభాగంతో కాకుండా పద్యభాగంతో ఆరంభమై ఉండవచ్చు. కాబట్టే, హిందీ భాషతో పాటు హిందీ పద్యాల పట్ల ఆకర్షణకు మొదటి బీజం పడింది. దూబే గారు స్వయంగా ఒక హిందీ కవి. అఖిల భారతీయ హిందూ మహాసభల అప్పటి అధ్యక్షుడు బర్మీ భిక్షు ప్రవరుడు "ఊ ఉత్తమ్" గారు భారతదేశం నుండి స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు ఆయన బర్మాలోని అనేక ప్రదేశాలను సందర్శించారు. స్థానిక సంస్థానాల్లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఆయన మాండలేను సందర్శించినప్పుడు, మాండలేలో కూడా ఆయనను స్వాగతిస్తూ ఎన్నో కార్యక్రమాలు జరిగాయి. అలాంటి ఒక కార్యక్రమం మా పాఠశాలలో కూడా జరిగింది. వారిని స్వాగతిస్తూ దూబే గారు ఒక భావపూరితమైన కవితను రచించారు. దానిని విద్యార్థులమైన మేమందరమూ కలిసి గానం చేశాము. దాని చివరి పంక్తి ఇలా ఉంది –

**"జైసే ఆప్ ఉత్తమ్ హై, హమే భీ ఉత్తమ్ బనా జాయే"** (మీరు ఎలా అయితే ఉత్తములో, మమ్మల్ని కూడా ఉత్తమంగా తయారు చేయండి).

దూబే గారి రచనల ప్రభావం నా మనసుపై ఎంతో బలమైన ప్రభావాన్ని చూపించింది. అది తరువాతి కాలంలో పద్య రచనల క్షేత్రంలో తగినంత ప్రేరణకు కారణమయింది. ఆ చిన్న వయసులో కూడా ఒక హిందీ దోహాను రచించాను. అందులో ఈ బాలకుని తడబాటు ప్రకటితమయింది.

"రహిమాన్ సుధా" చదువుతూ చదువుతూ, ఆ చిట్టి వయసులోనే నేను ఒక దోహా రాసేశాను. దాన్ని తాతగారికి చదివి వినిపిస్తే, వారెంతగానో నవ్వారు. ఆ దోహా అయితే నాకు గుర్తులేదు కానీ, నేనయితే "రహీమ్" లేదా "రహిమాన్" అనే పదాలు కలిగి ఉన్నవే దోహాలు అనుకునేవాడిని. అయితే తాతగారు నవ్వుతూ, "ఇవి నీవు రచించిన దోహాలు, ఇందులో రహీమ్ పేరెందుకు? నీ పేరే ఉండాలి కదా" అని అన్నారు. నేనెంతో సిగ్గుపడ్డాను. అయినప్పటికీ అది, దోహాలు రచించటంలో నేను చేసిన మొదటి ప్రయత్నం.

తాతగారు వల్లె వేస్తుండే రాజస్థానీ దోహాలు నేను మళ్ళీ మళ్ళీ వినేవాడిని.

**"చల్ సుందర్ మందిర్ చాలా, తుఝ్ బిన్ చల్యో న జాయ్।**
**మాతా దీ ఆసీసధీ, బై దిన్ పుణ్యా ఆయ్ ॥"**

(పద సుందర్, మందిరానికి వెళదాం. నీవు లేకుండా వెళ్ళలేను. తల్లి ఆశీర్వాదంతో పుణ్యం కలుగుతుంది).

మాత తన పిల్లలకు, **"బేటా, బూఢో డోకరో హొయే"** (ముసలివాడివి అయ్యేంత దీర్ఘాయువు కలిగి ఉండు) అని ఆశీర్వదించినట్లు, వారు కూడా నన్ను అలానే ఆశీర్వదించారు.

అందుకే మాత ఇచ్చిన ఆశీస్సులు ఇప్పుడు పని చేసి, నేను ముసలివాడినైపోయాను. తాతగారు పట్టుకుని నడిచే చేతికర్రను సుందర్ లేదా సుందరీ అని పిలిచేవాళ్ళం. ఎందుకంటే, అది లేకుండా ఆయన గుడికి వెళ్ళలేకపోయేవారు.

వారి మాటల్లోనే విన్న మరొక్క దోహా –

**"పాత్ ఝుడన్తా యూ కహ్యా, సుణ్ తరూవర్ బనరాయ్ ।**
**ఇబ్ కా బిఛధా నా మిలా, దూర్ పఢాంగా జాయ్ ॥"**

(ఓ తరూవర్ బనరాయ్, విను. ఆకులు రాలిపోతూ ఉంటాయి. ఒక్కసారి రాలిపోయిన ఆకులు మళ్ళీ తిరిగిరానంత దూరం వెళ్ళిపోతాయి.)

ఈ దోహాలోని అర్థాన్ని వారు వివరించకపోయినా, వారు తన మృత్యువును గురించి ప్రస్తావించారని, మృత్యువు కారణంగా కుటుంబం నుండి దూరమవటం ఎంతో బాధాకరంగా ఉంటుందని చెప్పినట్టు ఆ తరువాత అర్థం చేసుకున్నాను.

చిన్నతనంలో ఈ దోహాల బీజాలు మనసులో పడ్డాయి, వాటి ఆధారంగానే భవిష్యత్తులో ఎన్నో హిందీ, రాజస్థానీ దోహాలు రచించడం జరిగింది.

ఆ రోజుల్లో, మాండలే నగరానికి దగ్గరలో ఒక గోశాల ఉండేది. ప్రతి సంవత్సరమూ గోకులాష్టమి నాడు అక్కడ జాతర జరిగేది. ఆ జాతరలో నగర విద్వాంసులు ఎందరో ప్రసంగించేవారు. అందులో గో భక్తుల బృహత్ మండలి జత కలిసేది. నేను కూడా పాల్గొని, ఆ మండలిలో ప్రసంగిస్తే బాగుంటుంది అని గురుదేవులు దూబే గారు చెప్పారు. అందుకొరకు దూబే గారు నాలుగు పేజీల ప్రసంగాన్ని కూడా రాసేశారు. దానిని చూసిన తాతగారు, "చూసి

చదివితే, అదేమంత పెద్ద విషయం కాదు కదా! కంఠస్థం చేస్తే ఎంతో ప్రశంసనీయంగా ఉంటుంది.” అని చెప్పారు. ఆ ప్రసంగానికి ఉన్న అయిదు రోజుల సమయంలో నాలుగు పేజీలను కంఠస్థం చేసేసి, గోకులాష్టమి నాడు సభలో ఆ ప్రసంగాన్ని వినిపించాను. శ్రోతలు అవాక్కయిపోయారు. మాష్టారు గారు కూడా ప్రసన్నత చెందారు. ఆ మార్వాడీ స్కూలులో మొదటి తరగతి చదువుతున్న విద్యార్థికి ఇదెంతో గొప్ప విషయం.

ఆ రోజుల్లోనే వారు, “పరివర్తన్” (పరివర్తనం) అనే నాటకాన్ని స్వయంగా రచించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే దానిని ప్రదర్శించాము.

అందులో నాకు ఒక రాజకుమారుని పాత్రనిచ్చారు. ఆ రాజకుమారుని రాజసం ముగియగానే అతను దివాలా తీసి, ఒక బిచ్చగాడి లాగా తన రాజ్యం నుండి బయటపడి పల్లెటూరి వైపుకి వెళ్ళిపోతాడు. పల్లెటూరి వాతావరణం పట్ల నాకేమీ అవగాహన లేకపోయినప్పటికీ, ఎంతో ఉత్సాహంగా పల్లెటూరి జీవిత పాత్రను పోషించాను. అందులో నా చేత ఒక పాట కూడా పాడించారు. ఆ పాటలో – **“కరమగతి టారే నహీ టరీ”** – (నీ కర్మగతిలో ఎక్కడా నిలిచిపోవద్దు) అనే పంక్తి ఉండేది. దానిని ప్రజలు ఎంతగానో మెచ్చుకున్నారు. ఈ నాటకంతో నాకు, జీవితంలోని ఆటుపోట్లను ఎదుర్కోవటానికి కావలసిన ప్రేరణ కలిగింది. అది నాకు జీవితకాలమంతా ఉపయోగపడింది. అలా నాకు కవితా పఠనలు మరియు నాటకాల పట్ల ఉన్న ప్రవృత్తి పెరుగుతూపోయి, నేను ఎన్నో నాటకాల్లో పాల్గొన్నాను.

ఆ తరువాత మూడవ తరగతి కొరకు ఖాలసా పాఠశాలలో చేరాను. అక్కడ కూడా రెండు మూడు నాటకాల్లో పాల్గొని ప్రశంసా పాత్రుడినయ్యాను. పాఠశాల చివరి రోజుల్లో వేసిన నాటకంలో, సామ్రాట్ అశోకుని పాత్ర పోషించాను. దానిని చూడటానికి దేశ ప్రధాని “ఊ నూ” గారు వచ్చి ప్రజల ముందు నన్ను ప్రశంసిస్తూ రెండు మాటలు కూడా పలికారు.

ఈ రెండు ఘటనల కారణంగా, వేదికపైన మాట్లాడటానికి ఉండే సంకోచ బిడియాలు ఆ వయసులోనే చెరిపివేయబడ్డాయి. భవిష్యత్తులో బర్మాలో హిందీ ప్రచారానికి మరియు ప్రపంచమంతటా విపశ్యనా ప్రచారానికి ఎంతో సహాయకారిగా ఉపయోగపడ్డాయి.

గురుదేవులు దూబేగారు కురిపించిన కృపతో, ఆ బాల్యావస్థ నుండే తల్లిదండ్రుల పట్ల భక్తి, వారి ఆజ్ఞలను సంతోషంగా పాలించడం, సోదరుల పట్ల ఆదరణ మరియు చిన్నవారి పట్ల త్యాగపూరితమైన ప్రేమ వంటి అమృతపు ఉగ్గుపాలు చేతికందించి జీవితకాలమంతా ఉపయోగపడ్డాయి. అలా సారవంతమైన మనోభూమిలో నాటబడిన ఈ ధర్మబీజాలతో మొలకెత్తిన తీగలకు భవిష్యత్తులో ఎంతో తీయని ఫలాలే కాసాయి.

తరువాయి భాగం వచ్చే సంచికలో....

ఆత్మకథన్ 2 నుండి గ్రహించబడింది.

## కిశోర శిబిరాలు

బాలురకు – 29 సెప్టెంబర్ నుండి 07 అక్టోబర్ – ధమ్మ నాగార్జునలో

బాలికలకు – 17 అక్టోబర్ నుండి 25 అక్టోబర్ – ధమ్మ నాగార్జునలో

## ధర్మ సేవకుల శిక్షణా శిబిరాలు

26 ఆగస్టు నుండి 28 ఆగస్టు వరకు – ధమ్మ ఖెత్తలో

06 సెప్టెంబర్ నుండి 08 సెప్టెంబర్ వరకు – ధమ్మ నాగార్జునలో

## దీర్ఘ శిబిరాలు

45 రోజుల దీర్ఘ శిబిరం – 29 అక్టోబర్ నుండి 14 డిసెంబర్ వరకు ధమ్మ నాగార్జునలో

## కరీంనగర్‌లో 10 రోజుల శిబిరం

దసరా సెలవుల్లో కరీంనగర్‌లో 10 రోజుల శిబిరం నిర్వహించబడును. ఈ శిబిర తేదీలు, మరిన్ని వివరాలు త్వరలోనే www.dhamma.org నందు ఉంచబడతాయి. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోగలరు.


రెండు సంవత్సరాలకు చందా రూ 100/- **విపశ్యన తెలుగు మాసపత్రిక** **జీవిత చందా రూ. 500/-**

**ప్రచురణ తేది: ప్రతినెల 30/31** **పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2** **వెల: రూ 5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**

12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,

HYDERABAD - 500 070.

Website : www.vri.dhamma.org

E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.